'రాగమయి'

శ్రీ విజయ - రాఘవ

రఘునాథం క్రొత్తగా వుద్యోగంలో చేరాడు. పనిమీద శ్రద్ధ చూపకుండా యెప్పుడూ యేదో ఒక విషయాన్ని గురించి ఆలోచిస్తూ వుండేవాడు. రాజీనామాయిచ్చి యింటికి పోయి, వున్న పాతికెకరాల భూమిని సాగుచేసుకొందామనుకొనేవాడు. కాని "ఉద్యోగం పురుషలక్షణం" అన్న సామెత జ్ఞాపకం వచ్చేది. ఎంతో డబ్బు తగలేసి బి. ఎ. వరకు చదివినందుకు నాల్గుకాలాల పాటు వుద్యోగం చేద్దామనిపించబట్టే వచ్చిచేరాడు. మనస్సెందుకో స్వగ్రామంమీదికే పోతూండేది. సరిగ్గా అన్నం తినబుద్ధి అయ్యేది కాదు. రాగమయి దగ్గరనుండి కనీసం వుత్తరం వస్తుందేమోనని పరిపరి విధాలుగా పడిగాపులు పడ్డాడు. ఎన్నాళ్ళు చూచినా, కళ్ళు కాయలు కాసినా, మూడు కాన్ల కార్డుముక్క కూడా రాకుండా పోవడం వల్ల ఆరోజు కారోజు ఆశ్చర్యం ద్విగుణీకృతమవసాగింది. రఘునాథమే సాహసించి ఒక వుత్తరం వ్రాద్దామనుకొన్నాడు. కాని మనస్సొప్పలేదు. "చేస్తానన్న సహాయం చేయలేకపోయానే సమయానికి" అన్న దుఃఖం ఆనాటి కానాడు యెక్కువ అవసాగింది. 'రాగమయిని' "పాపా" అని పిల్చినప్పుడు తనేదో శృంగార నాయకుడిలాగా భావించుకొనేవాడు. రాగమయిని వివాహం చేసుకోవాలని రఘునాథానికి మనఃస్ఫూర్తిగా వున్నమాట నిజమే. కాని బంధువులంతా యీ సంబంధం చూసి అయిష్టత వెళ్ళబుచ్చారు. కారణం యేమిటీ? అతను పెద్దగా ఆలోచించలేదు. అనవసరమనిపించేసి. సుందరమ్మ సంసారాన్ని చే-తీసాడని, అసలిదంతా వాడు చెడిపోవడానికి కాలం సమీపించిందని, మేనమామ వెంకట్రావు భార్యతో అంటూండేనాడు. నాల్గు, అయిదుసార్లు వుత్తరాలుకూడా వ్రాశాడు. రఘునాథునికి — యీ విషయాన్ని పురస్కరించుకొని. కాని రఘునాథం ఆ వుత్తరాలు చదివి యేమీ జవాబులు యివ్వలేదు. రాగమయి యెన్నోసార్లు స్వప్నాల్లోకనిపిస్తూ జ్ఞాపకానికి తెచ్చుకొందామన్నా రానటువంటి స్వర్గసుఖాలను చవిచూపిస్తూండేది. ఆకలకరిగి పోకుండా ఎప్పుడూ అలావుంటే బాగుండుననిపించేది రఘునాథానికి. రాగమయి సౌందర్యంలో అంతులేనట్టి స్వర్గసుఖాల్ని, ఎంచలేనటువంటి జీవిత పరమావధిని అనుభవించగలననే ధైర్యం వుంటూ వుండేది.

రాగమయిని 'పాపా' అని పిల్చుకున్ననాడు తృప్తిగా వుండేది మనస్సు. శ్యామసుందరికి రాగమయికి చదువుకునేందుకు తానే ధనసహాయం చేసి వున్నాడు. శ్యామసుందరి తనకన్న రెండేళ్ళ పెద్దకాబట్టి అంతగా పరిచయం వుండేదికాదు. రాగమయి మీద రఘునాథానికి సర్వవిధాల అధికారంవుంది. అంతమాత్రానికి అవినీతిగా ప్రవర్తించలేదు. అతనిలో సభ్యత చాల గౌరవప్రదమైనటువంటిది. ఏదెంత వరకు వుండాలో అంతవరకే వుంచగలడు. రాగమయితో అతనికున్న పరిచయమే యీనాడు అతన్ని వుద్యోగం చేసుకోనివ్వడంలేదు. అయినా తప్పదు. అందుకనే తలవంచి, చేస్తూండక తప్పింది గాదు. ఒకప్రక్క రాగమయి సంస్మరణ మరోప్రక్క వుద్యోగం రభస అతన్ని ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి.

2

కుటుంబరావుకి రఘునాథం దత్తతగావచ్చిన కుమారుడు. వచ్చిన రెండు కాన్పులకు ఆడపిల్లలే కల్గటంవల్ల, తన వంశగౌరవాలు నిలబెట్టేందుకు మొగపిల్లలనుకనే భాగ్యం తనకు లేదేమో అని పరిపరి విధాలుగా పరితపించింది సుందరమ్మ. రఘునాథం

(385-వ పేజీ చూడుడు)

(344-వ పేజి తరువాయి)

అంటే సుందరమ్మకు కన్నకొడుకుమీదకన్నా యెక్కువగా వాత్సల్యం వుంటూ వుండేది. రఘునాథం యింకా రెండు సంవత్సరాలకు దత్తత వస్తాడనగా కుటుంబరావు పెళ్ళాం నాగలక్ష్మి పక్షవాతంవచ్చి చచ్చిపోయింది. వదినపోయిన నాటినుంచి, వరుసకు మేనత్త అయినా, రఘునాథం "అత్తయ్యా" అని పిల్చినప్పుడు సుందరమ్మకు మాతృత్వం పొంగి పొర్లి కట్టలుదాటేది. కుటుంబరావుకి నాగలక్ష్మి పోయిన నాటినుండి అదో తరహాగా వుండటం అలవాటయింది. బుద్ధి కుదిరినప్పుడు యింటిపట్టున వుండటం, వేళ గాని వేళల్లో, లేనిపోయిన ఆలోచనలతో భోజనం ముందు కూర్చోవటం, ఎవరేంచెప్పితే అది వింటం, మొదలుపెట్టాడు. రఘునాథంకి యీ ప్రవర్తనంతా ఆయేడుకాయేడు పైబడుతున్నకొద్దీ అర్థమవుతూ వచ్చింది. కుటుంబరావుకి, రఘునాథంకి యింత వండిపెడుతూ, తనకున్న యిద్దరాడపిల్లల్నీ చదివించుకొంటూ కాలక్షేపం చేస్తున్న రోజుల్లో, సుందరమ్మ భర్త కామేశ్వరరావు మదనపల్లివద్ద జరిగిన రైలు ప్రమాదంలో మరణించాడు. రఘునాథంకి పరిస్థితులు యీ సారి బాగా అర్థమయినాయి. ఇటు తండ్రిస్థితి చూడబోతే చీట్లపేకలో సర్వాస్తిని పోగొట్టే సూచనలు కనిపిస్తున్నాయి - చేరిన స్నేహితులు అంతా జూదరిగాళ్లే. ఒక్క క్షణంసేపుకూడా యింటిపట్టున వుండనీయకుండా, బెల్లంచుట్టూ యీగలు మూగినట్లు మూగుతూంటారు. కుటుంబ యోగక్షేమాలు - ఆస్తివ్యవహారాలు గురించి మంచీ చెడ్డలు ప్రస్తావిద్దామంటే వీలుదొరక్కుండా పోతున్నదని అంతరాత్మలో ఆవేదన, అటు చూడబోతే తల్లి కన్న యెక్కువగా పెంచి, పెద్దచేయతల్చుకున్న సుందరమ్మత్తయ్య, కాపురంలోని చీకటితెరలు, యివన్నీ రఘునాథంని పిచ్చివానిగా చేస్తున్నయి. నిండుకుండలాంటి మనిషి కాబట్టి రఘునాథం యీ గడ్డు సమస్యలన్నిటికి తలవంచుతూ, మంచి సమయంకోసం వేచి వుంటున్నాడు. సుందరమ్మ సంసారానికి కావలసిన సౌకర్యాలన్నీ తనే సమకూరుస్తూన్నాడు.

రఘునాథంమీద సుందరమ్మకి యింత మమకారం కల్గడానికి కారణం? "తనకు కావలసిన వసతులన్నీ, అతని ఆస్తిలోంచిపొంది, వున్న యిద్దరి కూతుళ్లను పెద్దచేసి చదువు చెప్పించి, వీలయితే రాగమయి నిచ్చి పెళ్లిచేసి తన కుటుంబాన్ని బాగుచేసుకొందామనే ఆశతో సుందరమ్మ అంటిపెట్టుకొనివుందా!" అని ఆ వూరివారంతా పరిష్కారం చేస్తున్న రోజుల్లో ఒకనాడు, కుటుంబరావు అయిదువందల రూపాయలు గురవయ్యగారి యెడ్ల సావిడిలో చీట్లపేకలో పోగొట్టుకొని, కసుచీకటిపడుతూండగా యింటి మలుపులోకిరాగానే యెక్కణ్ణుంచో వూడిపడినట్టు వచ్చాడు గిరిరాజు మామూలుకు. కుటుంబరావు తలవంచుకొని తూలుతూ వీధితలుపుతోస్తూ, "యివ్వాళంతా పోయిందిరా! రేపిస్తాలే" అని గొణిగాడు.

గిరిరాజు ఆ వూళ్లో చీట్లపేక ఆడేవాళ్లందరికీ జ్యోతిష్యంలాంటిదిచెపుతూ, అవసరమైతే ఆట మధ్యలో కాఫీలు - సిగరెట్లు అందిస్తూ, ఆట దగ్గరకు యితరులెవ్వరూ రాకుండా కాపలాకాస్తూ, ఆటముగిసిన తరువాత, అందరి దగ్గరా పావలా - అర్ధా మామూలుగా అడిగి పుచ్చుకొని బ్రతికే యానాదివాడు.

గిరిరాజుకి కోపంవచ్చింది.

కుటుంబరావు తలుపు దగ్గరగావేసి అవతలవైపు ఆనుకొనివున్నాడు.

"వారం రోజుల్నుంచి ఎగేస్తున్నారు దొరా! న్యాయంలేదు. జేబులో యెంతవుంటే అంతే యివ్వండి! మిగతాది తర్వాత యిద్దురుగాన్లే" అన్నాడు.

కుటుంబరావుకి వినిపించీ వినపించకుండా వినిపించాయి ఆ మాటలు.

"నీకెక్కడురా చెప్పేది. లేవంటల్లా! గొడవ సేయకు ... అవతలికిపో ... రేపు కనిపించు" అన్నాడు కుటుంబరావు.

గిరిజాజా పరుగుతూ వెళ్ళిపోగానే అక్కడ నుంచి బయలుదేరి తూలుతూపోయి నూతిగళ్ళెం దాపులోవున్న అరుగుమీద కూర్చొని అంచేత్తో గుండెను కప్పుకొంటూ ఘోరంగా దగ్గుతూండగా, సుందరమ్మ "ఎవరా మనిషి దగ్గేది" అని ఆశ్చర్యంతో లాంతరు పుచ్చుకొని, చీకటిని చీలుస్తూ నూతి దగ్గరకు వచ్చింది.

కుటుంబరావు పైపంచతో నోరు మూసుకొని దగ్గుతున్నాడు. లాంతరక్కడే పెట్టి మంచి నీళ్లు తేబోయింది. రఘునాథం ఆ రోజున వూళ్ళో లేడు. శ్యామసుందరి, రాగమయి కిటికీదగ్గరకొచ్చి —

"అక్కా! యేమిటో వాసనొస్తోందే" అంది రాగమయి.

"ఏమీ లేదుగాని, నువ్వారుకో చెల్లాయి" అంది శ్యామసుందరి.

"ఏమీ లేదంటావేమిటి? అంత వస్తూంటే!"

"అబ్బ! ... నువ్వు గొడవ చేయబోకే!"

ఇంతలో సుందరమ్మ మంచి నీళ్ళ చెంబుతో అందించింది. కుటుంబరావు ఒక గుక్కెడు పుక్కిలించి వుమ్మేశాడు. మరో గుక్కెడు తాగేడో లేదో, వెంటనే వాంతిలాగా రక్తంతో కలిసి వచ్చేసింది. ఏదో అది చెడువాసన. పులిసిన మజ్జిగ కంపు గబ్బుగా కొడుతూవుంది.

సుందరమ్మకు, కుటుంబరావు కక్కిన రక్తం చూడగానే గుండె బేజారెత్తింది.

"అన్నయ్యా! మంచం వేస్తాను. యిలా వచ్చి పడుకో" అంది సుందరమ్మ.

కుటుంబరావు యేం మాట్లాడలేదు. దగ్గు తెరలు తెరలుగా వస్తోంది. కిటికీలోంచి ఆ దృశ్యం చూడలేక శ్యామసుందరి, రాగమయి లోపలికి వెళ్ళిపోయారు. సుందరమ్మకు కుటుంబరావు పరిస్థితి చూస్తూంటే నవనాడులూ క్రుంగిపోతున్నట్లనిపించింది. కుటుంబరావుకి గుండెదడ యెక్కువయింది. సుందరమ్మకు ముచ్చెమటలు పోస్తున్నయి. దగ్గిదగ్గి మొగమంతా కందగడ్డలాగా యెర్రబారింది కుటుంబరావుకి. కళ్ళల్లో యెర్రచారలు మామూలుకన్నా యెర్రగా కనిపిస్తున్నాయి. తడిసిన చొక్కాలోంచి శరీరం చెమటకంపుకొడుతోంది. దగ్గు తెరలు తీవ్రంగా వస్తుంటే సుందరమ్మ చెవులుమూసి, దుర్గంధభూయిష్ఠమైన రక్తాన్ని కక్కిస్తోంది. ఒళ్ళంతా అపరిమితమైన వేడితో సలసల కాగిపోతోంది. క్రమేపి కక్కిన రక్తంమీద యిసుక చల్లడానికి వచ్చిన పాలేరు బిత్తాల్ని పొరలు కప్పుకొన్న కళ్ళతో చూసి "రఘూ!" వచ్చాడా అని అడిగాడు. సుందరమ్మకు హృదయంలో దేవినట్లయింది. కళ్ళ నీరూరింది.

"ఇంకా రాలేదురా! రఘూ" అంది.

చుట్టుప్రక్కలవాళ్లలో అప్పటికే యిద్దరు ముగ్గురు చూడడానికివచ్చారు. రఘునాథంకోసం శ్యామసుందరి, రాగమయి, సుందరమ్మ ఎదురుచూస్తున్నారు. ఆఖరు బస్సుకూడావచ్చి హారన్ మ్రోగించి వెళ్లినా రఘునాథంరాలేదు.

కుటుంబరావుకి వాకిటి వసారాలో మంచం వేసింది సుందరమ్మ. వచ్చి మెల్లగా పడుకున్నాడు. ఆకాశం వంక చూద్దామని ప్రయత్నిస్తున్నాడు. కాని చుట్టూ ఆవరించుకొన్న అమావాస్య చీకటి అతని కనురెప్పల్ని మూసేస్తోంది.

సుందరమ్మ వాకిటి గుమ్మానికి దగ్గరగా కుటుంబరావుకి వుపచర్యలు చేయు నిమిత్తం పమిటచెంగు పరుచుకొని పడుకొంది. శ్యామసుందరి, రాగమయి ఆపూట అన్నం తినడానికి మనసొప్పక వూరికే మధ్య యింటిలో పడుకొనివున్నారు. గాలికి తలుపు చప్పుడైనప్పుడల్లా "రఘునాథం వచ్చాడేమో" అని శ్యామసుందరి, తడబడుతూండేది. రాగమయికి "దబ్బున వస్తే బాగుండు"ననిపిస్తూండేది.

పగలల్లా చాకిరీచేసిన అలుపుమీద సుందరమ్మకు కునుకుపట్టీ పట్టనట్లు పట్టింది.

"కామేశ్వరరావు చనిపోయిన రైలు ప్రమాదంలోని దృశ్యాలన్నీ కళ్ళల్లో కనిపించాయి. పెట్టెలన్నీ రైలు పట్టాలకు దూరంగా దొర్లుకుపోయి తునాతునకలైవున్నాయి. (సశేషము)